సాక్షి
ఖమ్మం
ఆదివారం । 26 । మే । 2024



ఎమ్మెల్సీ ఓటు వేయండిలా..
సాధారణ ఎన్నికలతో పోలిస్తే గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ పోలింగ్ విభిన్నంగా ఉన్నందున ఓటు వేయాల్సిన విధానంపై కథనం. 8లో



... ఒకటికి మించి వద్దు!
పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో మొదటి ప్రాధాన్యత ఓటు తప్ప ఇంకొకటి వేయొద్దని పార్టీల నేతలు విస్తృత ప్రచారం చేస్తున్నారు. 8లో

గరిష్టం / కనిష్టం
42^{0} / 33^{0}

వాతావరణం
జిల్లాలో ఆదివారం ఉదయం వాతావరణం చల్లగా ఉంటుంది. ఆతర్వాత ఎండ మొదలై మధ్యాహ్నానికి గరిష్టస్థాయికి చేరుతుంది.

ప్రచారానికి తెర

ఉమ్మడి జిల్లాలో హోరెత్తించిన ఎమ్మెల్సీ అభ్యర్థులు

- చివరి రోజున ఆత్మీయ సమ్మేళనాలు
- మిగిలిన సమయంలో ఓటర్లను ప్రసన్నం చేసుకోవడంపై దృష్టి
- అధిక సంఖ్యలో పట్టభద్రులు ఉన్న ప్రాంతాలపై నజర్



సాక్షిప్రతినిధి, ఖమ్మం: నల్లగొండ – ఖమ్మం – వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గ ఉప ఎన్నిక ప్రచారానికి శనివారం తెరపడింది. గతంలో ఎన్నడూ లేనట్టుగా ఈసారి అన్ని పార్టీలు ఈ ఎన్నికను ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాయి. బరిలో ఉన్న అభ్యర్థుల తరఫున ఆయా పార్టీల అగ్రనేతలు ఉమ్మడి జిల్లాలో విస్తృతంగా పర్యటించారు. మొత్తం 52 మంది అభ్యర్థులు బరిలో ఉండగా.. కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ బలపరచిన తీన్మార్ మల్లన్న, ఏనుగుల రాకేష్‌రెడ్డి, గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి మధ్య ప్రధాన పోటీ ఉంటుందని తెలుస్తోంది. అయితే, ఒకరిద్దరు స్వతంత్ర అభ్యర్థులూ గట్టి పోటీ ఇస్తున్నారు. స్వతంత్ర అభ్యర్థి, ఓయూ నిరుద్యోగ జేఏసీ నేత పాలకూరి అశోక్‌కుమార్ ఉమ్మడి ఖమ్మంతో పాటు నల్లగొండ, వరంగల్ జిల్లాల్లోనూ విస్తృతంగా ప్రచారం చేశారు. ఇప్పుడు ప్రచారం ముగియడంతో ఓటర్లను ప్రసన్నం చేసుకోవడంపై పార్టీలు దృష్టి సారించాయి.

సాధారణ ఎన్నికలను తలపించేలా..

సాధారణ ఎన్నికలను తలపించేలా ఈసారి ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం సాగింది. ఇది బీఆర్ఎస్ సిట్టింగ్ స్థానం కావడం, మరోవైపు కాంగ్రెస్ అధికారంలో ఉండడం.. ప్రస్తుత కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్న గత ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి రెండో స్థానంలో నిలవడం.. మరోపక్క ఎలాగైనా సత్తా చాటాలని బీజేపీ భావిస్తుండడంతో ప్రచారం రసవత్తరంగా సాగింది. కాంగ్రెస్ తరఫున మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, బీఆర్ఎస్ నుంచి మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు, పువ్వాడ అజయ్‌కుమార్, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, ఎంపీ అభ్యర్థి నామా, ఎమ్మెల్సీ తాతా మధు తదితరులు ఉధృతంగా ప్రచారం నిర్వహించారు. ఇక బీజేపీ తరఫున ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి, జాతీయ కార్యవర్గ సభ్యుడు ఈటల రాజేందర్, ఖమ్మం, భద్రాద్రి జిల్లాల అధ్యక్షులు గల్లా సత్యనారాయణ, రంగాకిరణ్, కిసాన్‌మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి ప్రచారం చేశారు. స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఓయూ నిరుద్యోగ జేఏసీ నేత పాలకూరి అశోక్‌కుమార్ సైతం బీఆర్ఎస్, కాంగ్రెస్ వైఫల్యాలను వివరిస్తూ ప్రచారం చేయగా.. ఆయనకు ఉద్యోగాల కోసం సిద్ధమవుతున్న అభ్యర్థులు, నిరుద్యోగులు పలువురు మద్దతుగా నిలిచారు.

ఆ ప్రాంతాలే లక్ష్యంగా..

ఎక్కువ మంది పట్టభద్ర ఓటర్లు ఉన్న ప్రాంతాలను అభ్యర్థులు గుర్తించారు. ఆయా ప్రాంతాలే లక్ష్యంగా ఇప్పటికే ప్రచారం చేయగా, మిగిలిన సమయంలోనూ ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు ఇంటింటికీ వెళ్లాలని ప్రణాళిక సిద్ధం చేసుకున్నారు. ఓటర్ల జాబితా ఆధారంగా పార్టీల నాయకులు ఇంటింటికీ తిరగడం మొదలుపెట్టారు. ఎక్కువ మంది ఓటర్లు ఉన్న ఖమ్మం, ఖమ్మంరూరల్, సత్తుపల్లి, నేలకొండపల్లి, వైరా, కొత్తగూడెం, ఇల్లెందు తదితర ప్రాంతాలపై అభ్యర్థులు ఎక్కువగా దృష్టి సారించి నేరుగా కలిసే ప్రయత్నాలు ముమ్మరం చేశారు. లోక్‌సభ ఎన్నికల పోలింగ్ ముగిసిన నాటి నుంచి హోరాహోరీగా, గతంలో ఎన్నడూ లేనట్టుగా పట్టభద్రుల ఎన్నిక ప్రచారం జరగడం ఆసక్తి కలిగిస్తోంది.

ఓటర్ల ప్రసన్నం కోసం..

ప్రచారం ముగియడంతో అభ్యర్థులు పోల్ మేనేజ్‌మెంట్‌పై దృష్టి పెట్టారు. ఓటర్లను నేరుగా కలిసేందుకు ప్రాధాన్యం ఇస్తూనే ఫోన్ చేయడమే కాక వాయిస్ మెసేజ్‌లు పంపిస్తున్నారు. పట్టభద్రుల నియోజకవర్గం మూడు ఉమ్మడి జిల్లాల పరిధిలో ఉండడంతో అభ్యర్థులు స్థానిక నేతలకు బాధ్యతలు అప్పగించి చివరి రోజు ప్రచారం చేయించారు. ఇప్పటివరకు అగ్రనేతలు ప్రచారం చేసినా, చివరిరోజు స్థానిక నేతలు పట్టభద్రులతో భేటీలు, ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహించి తమ పార్టీ బలపరిచిన అభ్యర్థిని గెలిపించాలని కోరారు. ఇక మూడు ఉమ్మడి జిల్లాల్లో పర్యటించలేని స్వతంత్ర అభ్యర్థులు వాయిస్ మెసేజ్‌లపైనే దృష్టి పెట్టారు. ఈ నేపథ్యాన అభ్యర్థుల వాయిస్ మెసేజ్‌లతో పట్టభద్రుల సెల్‌ఫోన్లు మార్మోగాయి.

అమల్లోకి 144 సెక్షన్

ఎమ్మెల్సీ పోలింగ్ సమీపించడంతో 144 సెక్షన్ అమల్లోకి వచ్చింది. శనివారం సాయంత్రం 4 గంటల నుంచి మంగళవారం ఉదయం 6 గంటల వరకు ఇది అమల్లో ఉండనున్నందున ఒక ప్రాంతంలో ఎక్కువ మంది గుమికూడడాన్ని నేరంగా పరిగణిస్తారు. కర్రలు, జెండాలు, టపాసులు, ఇతర ఆయుధాలతో సంచరించడం, పోలింగ్ స్టేషన్‌కు కిలోమీటర్ పరిధిలో సమావేశాలు నిర్వహించడంపై నిషేధం విధించారు. ఇక ఎన్నికల రోజున పోలింగ్ స్టేషన్ల వద్ద పోలీసులు పటిష్ట బందోబస్తు చేపట్టనున్నారు.

పకడ్బందీగా ఎమ్మెల్సీ ఎన్నిక

- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వీ.పీ.గౌతమ్
- డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌లో ఏర్పాట్ల పరిశీలన


తాత్కాలిక స్ట్రాంగ్‌రూమ్‌లో ఏర్పాట్లపై సూచనలు చేస్తున్న కలెక్టర్ గౌతమ్

ఖమ్మం సహకారనగర్: వరంగల్, ఖమ్మం, నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికల ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వీ.పీ.గౌతమ్ సూచించారు. ఖమ్మంలోని ఎస్ఆర్ అండ్ బీజీఎన్ఆర్ కళాశాలలో ఏర్పాటుచేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌ను శనివారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రూట్ల వారీగా ఎన్నికల సామగ్రి పంపిణీకి అనుగుణంగా టేబుళ్లు ఏర్పాటుచేయాలని తెలిపారు. రూట్ అధికారులు, పోలింగ్ సిబ్బంది ఆదివారం ఉదయమే డిస్ట్రిబ్యూషన్ కేంద్రానికి వచ్చేలా చూడాలని, సామగ్రి తీసుకున్నాక ఉద్యోగులు సామగ్రితో సహా పోలింగ్ కేంద్రాలకు వెళ్లేలా జీపీఎస్ ట్రాక్ సిస్టంతో కూడిన బస్సులు సమకూర్చాలని చెప్పారు. జంబో బాక్సులకు క్లాత్ కవర్ సిద్ధం చేయాలని, ఈ బాక్సులు, పోలింగ్ సామగ్రి రవాణా కోసం హమాలీలను ఏర్పాటు చేయాలని కలెక్టర్ సూచించారు. అంతేకాక బ్యాలెట్ బాక్సుల రవాణా పోలీస్ ఎస్కార్ట్ నడుమ జరగాలని తెలిపారు. అలాగే, డిస్ట్రిబ్యూషన్ కేంద్రం వద్ద ఉద్యోగులకు విధులపై రెండో విడత శిక్షణ ఇవ్వాలని సూచించారు. అయితే, పోలింగ్ ముగిశాక బ్యాలెట్ బాక్సులను నల్లగొండకు తరలించాల్సి ఉన్నప్పటికీ.. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా బాక్సులు వచ్చేవరకు ఎస్ఆర్ అండ్ బీజీఎన్ఆర్ కళాశాలలోని తాత్కాలిక స్ట్రాంగ్ రూంలో భద్రపర్చాలని తెలిపారు. అయితే, వర్ష సూచన ఉన్నందున ఏ ఇబ్బంది రాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ స్పష్టం చేశారు. అదనపు కలెక్టర్లు బి.సత్యప్రసాద్, డి.మధుసూదన్‌నాయక్, పౌరసరఫరాల జిల్లా మేనేజర్ శ్రీలత, జిల్లా పౌరసరఫరాల అధికారి చందన్‌కుమార్, జెడ్పీ సీఈఓ వినోద్, డీఆర్డీఓ సన్యాసయ్య, ఆర్డీఓలు గణేష్, రాజేందర్, ఆర్టీఓ అఫ్రిన్ సిద్ధిఖీ, పరిశ్రమల శాఖ జీఎం అజయ్‌కుమార్, డీఈఓ సోమశేఖరశర్మ, ఏసీపీలు రమణమూర్తి, శ్రీనివాసులు, ఆర్టీసీ డిప్యూటీ ఆర్ఎం పవిత్ర, కేఎంసీ అసిస్టెంట్ కమిషనర్ సంపత్ తదితరులు పాల్గొన్నారు.

వాకర్లు, క్రీడాకారులకు అనుమతి లేదు

ఖమ్మం సహకారనగర్: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా ఖమ్మంలోని ఎస్ఆర్ అండ్ బీజీఎన్ఆర్ డిగ్రీ కళాశాల మైదానంలో డిస్ట్రిబ్యూషన్ కేంద్రం ఏర్పాటు చేస్తున్నందున ఆదివారం వాకర్లు, క్రీడాకారులకు అనుమతి ఉండదని కలెక్టర్ వీ.పీ.గౌతమ్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రత్యామ్నాయంగా సర్దార్ పటేల్ స్టేడియంకు వెళ్లాలని సూచించారు.

రెండు రోజులు మద్యం దుకాణాలు బంద్

ఖమ్మంక్రైం: ఎమ్మెల్సీ ఎన్నిక నేపథ్యాన రెండు రోజుల పాటు మద్యం విక్రయాలను నిలిపివేయాలని పోలీస్ కమిషనర్ సునీల్‌దత్ ఓ ప్రకటనలో సూచించారు. శనివారం సాయంత్రం నుండి సోమవారం సాయంత్రం నాలుగు గంటల వరకు ఈ నిర్ణయం అమల్లో ఉంటుందని, వైన్స్, బార్లు, మద్యం సరఫరా చేసే రెస్టారెంట్లు మూసివేయాలని ఆదేశించారు. నిబంధనలు అతిక్రమించి ఎవరైనా మద్యం దుకాణాలు తెరిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సీపీ హెచ్చరించారు.

న్యూస్‌రీల్

జమలాపురంలో అభిషేకం, నిత్యకల్యాణం


స్వామి దర్శనానికి వేచి ఉన్న భక్తులు

ఎర్రుపాలెం: తెలంగాణ తిరుపతిగా పేరున్న మండలంలోని జమలాపురం శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలోని శ్రీవారి పాదంతో పాటు స్వామి మూలవిరాట్‌కు పంచామృతాలతో అభిషేకం చేశారు. ఆతర్వాత స్వామి వారు, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి తెలంగాణ, ఏపీ నుంచి వేలాదిగా హాజరైన భక్తుల సమక్షాన నిత్యకల్యాణం జరిపించారు. అనంతరం పల్లకీ సేవ నిర్వహించగా భక్తులు దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ఈఓ జగన్మోహన్‌రావు, చైర్మన్ శ్రీరామచంద్రమూర్తి, సూపరింటెండెంట్ విజయకుమారి, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

'పద్మ' అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

ఖమ్మం రాపర్తినగర్: కేంద్రప్రభుత్వం 2025 సంవత్సరానికి గాను పద్మ అవార్డుల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తోందని జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి టి.సునీల్‌కుమార్‌రెడ్డి తెలిపారు. జిల్లాలోని వివిధ రంగాల్లో విశిష్ట సేవలందించిన యువత, సంస్థల బాధ్యులు అర్హులని పేర్కొన్నారు. పూర్తి వివరాల కోసం padmaawards.gov.in వెబ్‌సైట్‌లో పరిశీలించాలని తెలిపారు. నాలుగు జతల జిరాక్స్‌లతో పాటు పీడీఎఫ్ ఫార్మాట్‌లో జూన్ 5వ తేదీలోపు cystelngana@gmail.com ఈ-మెయిల్‌కు జత పర్చడమే కాక సికింద్రాబాద్‌లోని డైరెక్టర్ ఆఫ్ యూత్ సర్వీసెస్ కార్యాలయానికి చేరేలా పంపించాలని డీవైఎస్ఓ సూచించారు.

అధీకృత డీలర్ల వద్దే విత్తనాలు కొనాలి


సదస్సులో మాట్లాడుతున్న డీఏఓ విజయనిర్మల

కామేపల్లి/రఘునాథపాలెం/కారేపల్లి: లైసెన్స్ కలిగిన డీలర్ల వద్దే రైతులు విత్తనాలు కొనుగోలు చేయాలని జిల్లా వ్యవసాయాధికారి విజయనిర్మల సూచించారు. కామేపల్లి, రఘునాథపాలెం మండలాల్లోని పలు గ్రామాల్లో శనివారం నిర్వహించిన అవగాహన సదస్సుల్లో ఆమె మాట్లాడారు. విత్తనాల కొనుగోలు సమయాన తయారీ సంస్థ వివరాలు, విత్తన రకం, ముగింపు గడువు తదితర వివరాలు సరిచూసుకోవడమే కాక రశీదు తీసుకుని పంట చేతికొచ్చే వరకు భద్రపర్చుకోవాలని తెలిపారు. ప్రభుత్వం బోల్ గార్డ్-2 పత్తి గింజల ప్యాకెట్ ధర రూ.864గా నిర్ణయించిన నేపథ్యాన వ్యాపారులు అంతకంటే ఎక్కువ వసూలు చేస్తే ఫిర్యాదు చేయాలని చెప్పారు. గ్రామాలకు వచ్చే వారి వద్ద లూజ్ విత్తనాలను కొనుగోలు చేయొద్దని సూచించారు. అలాగే, భూసారం పెరిగేందుకు దోహదపడే పచ్చిరొట్ట విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలని డీఏఓ తెలిపారు. అలాగే, కారేపల్లిలోని ఎరువుల దుకాణాలను డీఏఓ విజయనిర్మల తనిఖీ చేశారు. ఏడీఏ ఎ.శ్రీనివాసరావు, ఏఓలు తారాదేవి, భాస్కర్‌రావు, ఉమామహేశ్వరెడ్డి, ఏఈఓలు ఉషా, మున్నీ, బి.జగదీశ్వర్, మహేష్, కిన్నెర, ప్రతిభ, శ్రీకన్య, వెంకటలీల, త్రివేణి, బుచ్చి బాబు, వేదవ్యాస్, కార్తీక్, శివకృష్ణ పాల్గొన్నారు.

గురుకుల కళాశాలల్లో ప్రవేశానికి కౌన్సెలింగ్


కౌన్సెలింగ్‌కు హాజరైన విద్యార్థులు

పాల్వంచరూరల్: ఉమ్మడి జిల్లాలోని గిరిజన సంక్షేమ శాఖ గురుకుల బాలుర కళాశాలల్లో ఇంటర్‌మీడియట్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలు కల్పించేందుకు పాల్వంచ మండలం కిన్నెరసానిలో శనివారం కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా 350 మంది విద్యార్థులు హాజరుకాగా, అర్హులకు కృష్ణసాగర్, దమ్మపేట, కిన్నెరసాని, గుండాల, సింగరేణి, తిరుమలాయపాలెం కళాశాలల్లో ఖాళీగా ఉన్న సీట్లు కేటాయించనున్నట్లు ఆర్‌సీఓ వెంకటేశ్వరరాజు తెలిపారు. కౌన్సెలింగ్‌లో కళాశాలల ప్రిన్సిపాళ్లు గోవర్ధన్, హరిసింగ్, జాన్‌నాయక్, పుల్లయ్య, మార్కండేయులు తదితరులు పాల్గొన్నారు.

రామయ్యకు వైభవంగా సువర్ణ తులసీ అర్చన


నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం: భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి వారికి శనివారం వైభవంగా సువర్ణ తులసీ అర్చన నిర్వహించారు. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవా కాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం చిత్రకూట మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం చేశారు. ఆ తర్వాత స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగ నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. వారాంతపు సెలవురోజులు కావడంతో ఆలయం భక్తులతో కిటకిటలాడింది.

అది ప్రశ్నించే గొంతు కాదు..

- తీన్మార్ మల్లన్నది బెదిరించే గొంతు
- కాంగ్రెస్, బీఆర్ఎస్ ప్రజలకు చేసిందేమీ లేదు
- పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యుడు ఈటల రాజేందర్


ఇల్లెందు సభలో మాట్లాడుతున్న ఈటల రాజేందర్, పక్కన సీతారాంనాయక్, వినోద్‌రావు తదితరులు

ఇల్లెందు/చుంచుపల్లి/మణుగూరు : ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్నది ప్రశ్నించే గొంతు కాదని, అది బెదిరించే గొంతుక అని బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు ఈటల రాజేందర్ ఆరోపించారు. ఇక బీఆర్ఎస్‌కు ఓటేసినా ప్రజలకు ఒరిగేదేమీ లేదన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి విజయాన్ని కాంక్షిస్తూ శనివారం ఆయన ఇల్లెందు, కొత్తగూడెం, మణుగూరులో నిర్వహించిన సమావేశాల్లో మాట్లాడారు. పట్టభద్రులు, మేధావులు ఓటేస్తే గెలిచిన పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఏనాడూ పట్టభద్రుల కోసం పనిచేయలేదని విమర్శించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు పట్టభద్రులకు డబ్బులు పంచినట్లు ప్రచారం సాగుతోందని, అలా చేస్తే పట్టభద్రులు లొంగిపోతారా అని ప్రశ్నించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆరు నెలలు కావొస్తుండగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం తప్ప ఇంకేమీ చేయలేదని విమర్శించారు. అనేక హామీలిచ్చి మాట తప్పిన ముఖ్యమంత్రిని ప్రశ్నించే ధైర్యం తీన్మార్ మల్లన్నకు ఉందా అని ప్రశ్నించారు. హామీల అమలుకోసం మాట్లాడే ధైర్యం బీజేపీ అభ్యర్థి ప్రేమేందర్‌రెడ్డికి మాత్రమే ఉందన్నారు. కాగా, తెలంగాణ ఉద్యమంలో ఉమ్మడి ఖమ్మం జిల్లాకు ప్రత్యేక స్థానం ఉందని, 1969 నుంచి మూడు తరాల ఉద్యమ చరిత్రలో తొలి తూటా దెబ్బ తగిలింది ఖమ్మం వాసులకే అని గుర్తు చేశారు. విద్యార్థుల బలిదానాలతోనే రాష్ట్రం సిద్ధించిందని, కానీ పదేళ్లుగా ఉద్యోగాలు లేక యువత ఎదురుచూస్తోందని అన్నారు. గతంలో కేసీఆర్ ఇచ్చిన హామీలన్నీ విస్మరించారని, అదే దారిలో నేడు కాంగ్రెస్ ప్రభుత్వం కూడా పని చేస్తోందని ఎద్దేవా చేశారు. తాజాగా జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి ఊహించనన్ని సీట్లు వస్తాయని, ఖమ్మం, మహబూబాబాద్‌లోనూ విజయం తమదేనని ఈటల ధీమా వ్యక్తం చేశారు. ఈ సమావేశాల్లో ఖమ్మం, మహబూబాబాద్ పార్లమెంట్ స్థానాల బీజేపీ అభ్యర్థులు తాండ్ర వినోద్‌రావు, అజ్మీరా సీతారాంనాయక్, పార్టీ భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు కే.వీ.రంగాకిరణ్, నాయకులు పాల్గొన్నారు. కాగా, భద్రాచలంలో శ్రీ సీతారామచంద్రస్వామి వారిని మాజీ మంత్రి ఈటల రాజేందర్ శనివారం దర్శించుకుని పూజలు చేశారు.

తవ్వకాలను పర్యవేక్షించండి..

చెరువుల్లో కందకాలపై జల వనరుల శాఖకు మత్స్య శాఖాధికారి లేఖ

నేలకొండపల్లి: జిల్లాలోని చెరువుల నుంచి పూడిక మట్టిని రైతుల పొలాల్లోకి తరలించుకునేందుకు అనుమతించగా ఇష్టారాజ్యంగా చేపడుతున్న తవ్వకాలతో నీళ్ల నిండాక మత్స్యకారులు ప్రాణాలు కోల్పోయే ప్రమాదముందని జిల్లా మత్స్యశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డి.ఆంజనేయస్వామి పేర్కొన్నారు. ఈమేరకు ఆయన జల వనరుల శాఖ అధికారులకు రాసిన లేఖ కాపీని కలెక్టర్‌కు సైతం సమర్పించారు. చెరువుల్లో మట్టి తవ్వకాల విషయంలో కొందరు ఇష్టానుసారంగా వ్యవహరిస్తుండడంతో భవిష్యత్‌లో ఇబ్బందులు ఏర్పడే అవకాశముందని తెలిపారు. పెద్దబీరవల్లి, గుబ్బగుర్తి తదితర గ్రామాల్లోని చెరువులను పరిశీలించిన సమయాన లోతైన కందకాలు ఉన్నాయని, వీటితో మత్స్యకారులకు ముప్పు పొంచి ఉందని చెప్పారు. ఇకనైనా లోతైన కందకాలు తీయకుండా, నిబంధనలు పాటించేలా పర్యవేక్షణ కోసం శాఖ ఉద్యోగులకు ఆదేశాలు ఇవ్వాలని జిల్లా జల వనరుల శాఖ అధికారికి రాసిన లేఖలో ఏడీ ఆంజనేయస్వామి కోరారు.

ఎమ్మెల్సీ ఓటు వేయండిలా..

- బరిలో ఉన్న అభ్యర్థులందరికీ ఓటు వేయొచ్చు
- '1'ప్రాధాన్యత అంకె ఇవ్వకుండా మిగతావి ఇస్తే ఆ ఓటు చెల్లదు
- అధికారి ఇచ్చిన పెన్నునే ఉపయోగించాలి
- రేపు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలు



నల్లగొండ: వరంగల్‌-ఖమ్మం-నల్లగొండ పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఉప ఎన్నిక పోలింగ్ సోమవారం జరగనుంది. ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో 52 మంది అభ్యర్థులు ఉన్నారు. ఈ ఉప ఎన్నిక బ్యాలెట్ పేపర్ పద్ధతిన నిర్వహిస్తున్నారు. అయితే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు ఇతర సాధారణ ఎన్నికలకు ఓటు వేసే విధానంలో చాలా తేడా ఉంటుంది. ఎమ్మెల్యే, ఎంపీ ఎన్నికల్లో ఓటు వేసే క్రమంలో ఈవీఎంలను వాడతారు. ఆ ఎన్నికల్లో అభ్యర్థి పేరు, పార్టీ గుర్తు ఉంటుంది. ఒకే అభ్యర్థికి ఓటు వేయాల్సి ఉంటుంది. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు అందుకు భిన్నంగా ఉంటాయి. ఈ ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులందరికీ ప్రాధాన్యతా క్రమంలో ఓటు వేసే అవకాశం ఓటర్లకు ఉంటుంది.

ప్రాధాన్యత క్రమంలోనే ఓటు..

- ప్రతి ఓటరు బరిలో ఉన్న మొత్తం అభ్యర్థుల్లో ఒక్కరికి లేదా కొందరికి లేదా అందరికీ ఓటేయవచ్చు.
- కేవలం అంకెలు మాత్రమే ఆ బాక్సులో ప్రాధాన్యత క్రమంలో వేయాల్సి ఉంటుంది.
- మొదటి ప్రాధాన్యత ఓటు వేస్తేనే ఆ ఓటు చెల్లుబాటు అవుతుంది.
- ఏ వ్యక్తికైతే మొదటి ప్రాధాన్యత ఓటు వేస్తారో ఆ వ్యక్తి బ్యాలెట్ పేపర్ వరుసలో ఏ నంబర్‌లో ఉన్నా కూడా.. బాక్సులో 1 అనే అంకె వేయాల్సి ఉంటుంది.
- 1, 2, 3, 4, 5 ఇలా ప్రాధాన్యత క్రమంలో పోటీలో ఉన్న అభ్యర్థులకు ఓటు వేయాలి.

కేవలం ఒకరికి కూడా ఓటేయొచ్చు

- పోటీలో ఎంత మంది అభ్యర్థులు ఉన్నా అందులో 40వ సీరియల్ నంబర్‌లో ఉన్న అభ్యర్థికి ఒక్కరికే ఓటు వేయాలంటే ఆ అభ్యర్థికి ఎదురుగా ఉన్న బాక్సులో 1 అని ఓటు వేసి మిగతా వారికి వేయకున్నా ఆ ఓటు చెల్లుతుంది.
- 1వ నంబర్ ప్రాధాన్యత ఓటు వేయకుండా 2, 3, 4 నంబర్లతో ఓట్లేస్తే ఆ ఓటు చెల్లదు.
- తప్పనిసరిగా 1 నుంచి సీరియల్‌గా మాత్రమే ఓటు వేయాలి.
- ఒక అభ్యర్థికి ఒక అంకెను మాత్రమే వేయాలి.
- అంకెలను తెలుగులో కానీ, ఇంగ్లిష్‌లో, ఇతర భాషాల్లో వన్, టు, త్రీ అని పదాలు, అక్షరాల్లో రాయకూడదు.
- బ్యాలెట్ పేపర్‌పై ఎలాంటి సంతకాలు చేయకూడదు.
- వేలిముద్ర వేయకూడదు.
- అభ్యర్థికి ఎదురుగా ఉన్న బాక్సులో రైట్ గుర్తు, ఇంటూ వంటి ఎలాంటి గుర్తులు పెట్టిన ఓటు చెల్లకుండా పోతుంది.

ఓటు వేసే విధానం..


- ప్రతీ అభ్యర్థికి ఎదురుగా పార్టీ పేరు లేదా స్వతంత్ర అభ్యర్థి అని రాసి ఉంటుంది.
- పార్టీల గుర్తులు ఉండవు.
- అభ్యర్థి పేరు ఎదురుగా ఖాళీ బాక్స్ ఉంటుంది.
- పోలింగ్ అధికారి ఇచ్చిన పెన్నుతో మాత్రమే ఓటరు తన ఓటు వేయాల్సి ఉంటుంది.
- అభ్యర్థి పేరు ఎదురుగా ఖాళీ బాక్స్‌లో పెన్నుతో కేవలం నంబర్ మాత్రమే వేయాల్సి ఉంటుంది.

సొంత పెన్నుతో ఓటు వేయొద్దు..

- బ్యాలెట్‌లో ఓటర్ ఓటు వేసేటప్పుడు సొంత పెన్నుతో ఓటు వేయరాదు.
- అలా వేస్తే ఓటు చెల్లదు.
- ఒకరికి ఇచ్చిన ప్రాధాన్యత ఓటు మరో అభ్యర్థికి ఇచ్చినా ఆ ఓటు చెల్లదు.
- ఒకరికి 1వ నంబర్ వేసి దాన్ని పదేపదే దిద్దినా ఆ ఓటు చెల్లకుండా పోతుంది.
- బ్యాలెట్ పేపర్‌ను బాక్సులో వేయకుండా తీసుకెళ్తే కేసు నమోదు చేస్తారు.
- బాక్సు మధ్యలో మాత్రమే నంబర్ రాయాల్సి ఉంటుంది.
- రిటర్నింగ్ అధికారి ఇచ్చిన ఊదా రంగు స్కెచ్ పెన్నుతో గాక ఇతర ఏ పెన్నులతో రాసినా అది చెల్లుబాటు కాదు.
- ఏ అంకెలు వేయకుండా ఖాళీ బ్యాలెట్ పేపర్ ఇచ్చిన ఆ ఓటు చెల్లుబాటు కాదు.

ప్లీజ్.. ఒకటికి మించి వద్దు !

- మొదటి ప్రాధాన్యత ఓటు మాత్రమే వేయండి
- ఎమ్మెల్సీ ఎన్నికల వేళ నేతల విస్తృత ప్రచారం
- సాధారణ ఎన్నికలను మించి హడావుడి



సత్తుపల్లి: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో మొదటి ప్రాధాన్యత ఓటు మాత్రమే వేయాలని, రెండు, మూడు ఎవరికీ వేయొద్దని ప్రధాన రాజకీయ పార్టీల అభ్యర్థులు విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. మొదటి ప్రాధాన్యత ఓట్లు 50శాతం వస్తేనే విజయం వరిస్తుంది. లేకపోతే రెండో ప్రాధాన్యత ఓట్లు లెక్కించాల్సి ఉన్నందున రాజకీయ పార్టీల నేతలను కలవరానికి గురి చేస్తోంది. ఇప్పటి వరకు జరిగిన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో రెండో ప్రాధాన్యత ఓటుతోనే ఎక్కువ మంది విజయాన్ని దక్కించుకున్నారు. మొదట ప్రాధాన్యత ఓటు వేశాక రెండో ప్రాధాన్యత ఓటు కూడా వేస్తే.. పోటీలో ఉన్న ప్రధాన అభ్యర్థులకు ఇవి ఎక్కువగా నమోదైతే రెండో స్థానంలో ఉన్న అభ్యర్థి విజయం సునాయసమవుతుంది. అందుకే అభ్యర్థులు ఒక ఓటు మాత్రమే వేయాలని ప్రచారం చేయడం ఆసక్తిని రేకెత్తిస్తోంది. సోమవారం జరగనున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికలకుగాను ఖమ్మం జిల్లాలో 83,879 మంది పట్టభద్రులు ఓటు హక్కు నమోదు చేసుకున్నారు. అత్యధికంగా ఖమ్మం అర్బన్ మండలంలో 26,917 మంది.. తక్కువగా ఏన్కూరు మండలంలో 1,597 మంది ఓటర్లు ఉన్నారు. ఇక భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 40,106మంది పట్టభద్ర ఓటర్లు ఉన్నారు.

పట్టభద్రుల నాడీపట్టేందుకు...

పట్టభద్రుల నాడీ పట్టేందుకు రాజకీయ పార్టీలు వ్యూహప్రతివ్యూహాలు పన్నుతున్నారు. ఓటర్లను చేరుకోవడంలో అధికార కాంగ్రెస్ పార్టీ ముందుండగా.. ప్రతిపక్ష బీఆర్‌ఎస్ సైతం శక్తి మేరకు పనిచేసింది. పట్టభద్రులు పలువురు ఆన్‌లైన్‌లో ఓటరుగా నమోదు చేసుకున్నారు. మిగతా వారి విషయంలో అధికార, ప్రతిపక్ష పార్టీల కార్యకర్తలు విస్తృతంగా అవగాహన కల్పించారు. ఆపై బరిలోకి దిగిన అభ్యర్థులు తరఫున తరఫున సాధారణ ఎన్నికల మాదిరిగానే ఆయా పార్టీ అగ్రనేతలు, మంత్రులు ఎన్నికల ప్రచారం చేయడంతో ఓటర్లలో ఆసక్తి నెలకొంది. పట్టభద్రులు, నిరుద్యోగ, ఉపాధ్యాయ సమస్యలే కాక రాష్ట్రంలో జరుగుతున్న రాజకీయ పరిణామాలు ప్రచారంలో చర్చకు వచ్చాయి. ఈనేపథ్యాన సైలెంట్ ఓటింగ్ కీలకంగా మారుతుందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

పాజిటివ్ ఓటు మనకే!

అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికలు ముగిసి నెలల వ్యవధే అయినందున ప్రభుత్వంపై ఉద్యోగ, ఉపాధ్యాయ ఓటర్ల పాజిటివ్‌గానే స్పందిస్తారని అధికార పార్టీ నమ్ముతోంది. ఇదేసమయాన నిరుద్యోగ యువకులు ప్రభుత్వంపై వ్యతిరేకంగా ఉన్నారని ప్రతిపక్ష పార్టీల నాయకులు చెబుతున్నారు. ఉద్యోగుల్లో ప్రభుత్వంపై వ్యతిరేకత రాలేదని, నూతన ప్రభుత్వం ఏర్పడ్డాక జరుగుతున్న తొలి ఎన్నికలైనందున ప్రభుత్వానికి కొంత సమయం ఇస్తే బాగుంటుందని భావిస్తున్నట్లు అధికార పార్టీ నేతలు నమ్మకంగా ఉన్నట్లు సమాచారం. ఈక్రమంలో అధికార పార్టీ ప్రచారాన్ని తిప్పికొడుతూ నూతన ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను విస్మరించిందని ప్రతిపక్ష పార్టీల నేతలు విస్తృత ప్రచారం చేస్తున్నారు. ఈనేపథ్యాన మొత్తం ఓటర్లలో ఉద్యోగులు ఎంత మంది ఉంటారని లెక్కలు వేసుకుంటున్నారు.

గ్రామీణ ఓటర్ల ప్రసన్నం కోసం..

పట్టణ ఓటర్ల కంటే గ్రామీణ ఓటర్లను ప్రసన్నం చేసుకోవడానికే రాజకీయ పార్టీలు ప్రాధాన్యత ఇస్తున్నాయి. వార్డుల వారీగా పట్టభద్రుల ఓటర్ల విభజన చేసి.. ఎవరు చెపితే ఓటు వేస్తారో వారితో నేరుగా లేదా ఫోన్‌లో చెప్పిస్తున్నారు. అధికార కాంగ్రెస్ పార్టీ ఈ విషయంలో ముందుందని తెలుస్తోంది. మరోపక్క బీఆర్‌ఎస్ నేతలు సైతం సైతం సిట్టింగ్ స్థానం కావడంతో పాత ఒరవడిని కొనసాగిస్తూ ప్రచారం చేస్తున్నారు. గ్రామీణ ఓటర్లను ఆకట్టుకునేలా రాజకీయ పార్టీల ముఖ్య నేతలు రైతు సమస్యలను ప్రస్తావిస్తున్నారు. అలాగే, ఉద్యోగాల నిమిత్తం ఇతర ప్రాంతాల్లో ఉన్న వారు పోలింగ్ నాటికే వచ్చేలా ఫోన్లలో అభ్యర్థిస్తున్నారు.

పాలకూరి అశోక్‌కు బీఎస్పీ మద్దతు



మాట్లాడుతున్న చెరుకుపల్లి నాగేశ్వరావు

ఖమ్మం మామిళ్లగూడెం: నల్లగొండ – ఖమ్మం – వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్న తెలంగాణ ఉద్యమకారుడు, బహుజన నాయకుడు పాలకూరి అశోక్‌కుమార్‌కు తమ మద్దతు ఇస్తున్నట్లు బీఎస్పీ పార్టీ ప్రకటించింది. ఖమ్మంలోని పార్టీ కార్యాలయంలో శనివారం జరిగిన సమావేశంలో జిల్లా అధ్యక్షుడు చెరుకుపల్లి నాగేశ్వరావు, రాష్ట్ర నాయకుడు ఉపేంద్రసాహు మాట్లాడుతూ మండలిలో పట్టభద్రుల సమస్యల పరిష్కారానికి కృషి చేసే సత్తా ఉన్న అశోక్‌కుమార్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. కాగా, అశోక్‌కుమార్‌కు మద్దతు ఇచ్చిన బీఎస్పీ అధినేత మాయావతి, జాతీయ కోఆర్డినేటర్ రాంజీ గౌతమ్, మందా ప్రభాకర్‌కు వారు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో మిరియాల నాగరాజు, విజయ్‌కుమార్, గౌతమ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

'రాజ్యాంగాన్ని రక్షించేది కాంగ్రెస్ పార్టీనే'

ఖమ్మం సహకారనగర్: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్నను గెలిపించాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి పిలుపునిచ్చారు. ఖమ్మంలోని యూటీఎఫ్ కార్యాలయంలో శనివారం ఆయన మాట్లాడుతూ మల్లన్నకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. పోటీ చేస్తున్న పార్టీల్లో కాంగ్రెస్ మాత్రమే భారత రాజ్యాంగాన్ని రక్షించడం, లౌకిక విధానాన్ని కొనసాగించడంలో చిత్తశుద్ధిగా వ్యవహరిస్తున్న పార్టీ అని తెలిపారు. ఈనేపథ్యాన భిన్నత్వంలో ఏకత్వాన్ని కాపాడే కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించడం మంచిదని చెప్పారు. ఇక బీజేపీ ప్రజల మధ్య మతం పేరిట చిచ్చు పెడుతుండడమే కాక కార్పొరేట్ వర్గాల కోసం పనిచేస్తోందని, నూతన విద్యావిధానం పేరిట విద్యారంగం ప్రైవేటీకరణకు పూనుకుందని ఆరోపించారు. బీఆర్‌ఎస్ కూడా అదే దారిలో ఉన్నందున కాంగ్రెస్ అభ్యర్థి మల్ల న్నను గెలిపించడమే ఉత్తమమని నర్సిరెడ్డి తెలిపారు. ఈ సమావేశంలో టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జీ.వీ.నాగమల్లేశ్వరరావు, షేక్ ఉద్దండు షరీఫ్ పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ అభ్యర్థిని గెలిపించండి

ఖమ్మంమయూరిసెంటర్: నల్లగొండ – ఖమ్మం – వరంగల్ పట్టభద్రుల నియోజకవర్గం ఎమ్మెల్సీ ఉప ఎన్నికలో బీఆర్‌ఎస్ అభ్యర్థి ఏనుగుల రాకేష్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర ఒక ప్రకటనలో కోరారు. శాసనమండలిలో అడుగు పెట్టడానికి రాకేష్‌రెడ్డికి అన్ని అర్హతలు ఉన్నాయని తెలిపారు. మాజీ సీఎం కేసీఆర్ పదేళ్ల పాలనలో సుమారు 2లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు ఇవ్వగా, ఐటీ, ఫార్మా, టెక్స్‌టైల్స్, ఏరోస్పేస్ తదితర రంగాల్లో విదేశీ పెట్టుబడులతో 9లక్షల మందికి ఉద్యోగాలు లభించాయని వివరించారు. అలాగే, ప్రభుత్వం ఉద్యోగులకు మెరుగైన పీఆర్సీ ఇచ్చిన ఘనత బీఆర్‌ఎస్‌కు ఉందని తెలిపారు. ఈనేపథ్యాన పట్టభద్రులు ఎమ్మెల్సీ ఎన్నికలో రాకేష్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఎంపీ విజ్ఞప్తి చేశారు.

అభివృద్ధి, సంక్షేమంపై చర్చకు సిద్ధమా?

బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తాత మధుసూదన్



మాట్లాడుతున్న తాత మధు, పక్కన నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: బీఆర్‌ఎస్ ప్రభుత్వం హయాంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమంపై చర్చకు రాష్ట్ర మంత్రులు సిద్ధమా అని పార్టీ బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తాత మధుసూదన్ సవాల్ చేశారు. ఖమ్మంలోని బీఆర్‌ఎస్ జిల్లా కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గత ప్రభుత్వంలో రైతు బంధు రాలేదని, రైతులకు ఏమీ చేయలేదని చెబుతున్న మంత్రులు.. 2014కు ముందు, ఇప్పుడు జిల్లా ఉందో చెప్పాలని ప్రశ్నించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో తుమ్మల నాగేశ్వరరావు మంత్రిగా ఉన్నప్పుడే పాలేరు నియోజకవర్గంలో భక్తరామదాసు ప్రాజెక్టును పూర్తి చేసి రైతులకు నీళ్లు అందించిన విషయాన్ని మరిచిపోవద్దన్నారు. కాగా, కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేసేలా ఒత్తిడి తీసుకొచ్చేందుకు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలో బీఆర్‌ఎస్ అభ్యర్థి, విద్యావంతుడు ఏనుగుల రాకేష్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని తాతా మధు కోరారు. ఈ సమావేశంలో జెడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజు, డీసీసీబీ మాజీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, బీఆర్‌ఎస్ నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు, నాయకులు ఉప్పల వెంకటరమణ, జీవన్‌కుమార్, తాజుద్దీన్, వేణు తదితరులు పాల్గొన్నారు.



మహబూబ్ అలీ మృతి ఉద్యమాలకు తీరనిలోటు

సంతాప సభలో వక్తల నివాళి



అలీ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ నర్సిరెడ్డి, నాయకులు

ఖమ్మం సహకారనగర్/ఖమ్మం అర్బన్: టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర ఆడిట్ కమిటీ కన్వీనర్ షేక్ మహబూబ్ అలీ మరణం ఉపాధ్యాయ ఉద్యమానికే కాక విద్యారంగానికి తీరనిలోటని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి, టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.జంగయ్య, చావ రవి పేర్కొన్నారు. గుండెపోటుతో శుక్రవారం మృతి చెందిన షేక్ మహబూబ్ అలీ సంతాప సభ ఖమ్మం పాండురంగాపురంలోని అలీ నివాసం వద్ద శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ, నాయకులు మాట్లాడుతూ ఉపాధ్యాయుడుగా విద్యార్థులను తీర్చిదిద్దడమే కాక ఉద్యమ నేతగా ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి పాటుపడ్డారని తెలిపారు. కాగా, సంఘం ఆధ్వర్యాన ఏర్పాటుచేసిన కుటుంబ సంక్షేమ నిధి పథకం డైరెక్టర్‌గా ఉన్న మహబూబ్ అలీ కుటుంబానికి రూ.6లక్షల చెక్కును అందజేశారు. అనంతరం అలీ అంత్యక్రియల్లో నాయకులు పాల్గొన్నారు. టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు జీ.వీ.నాగమల్లేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ సభలో సీపీఎం నాయకుడు పోతినేని సుదర్శన్‌రెడ్డి, యూటీఎఫ్ కుటుంబ సంక్షేమ నిధి పథకం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.రాజశేఖర్ రెడ్డితో పాటు వివిధ ఉపాధ్యాయ సంఘాలు, పార్టీల నాయకులు బండి నర్సింహారావు, సీహెచ్ రాములు, సీహెచ్.దుర్గాభవాని, టి.లక్ష్మారెడ్డి, పి.మాణిక్‌రెడ్డి, ఎస్.డీ.జియాఉద్దీన్, పి.నాగిరెడ్డి, వి.మనోహర్‌రాజు, ఎస్.విజయ్, ఎస్.కృష్ణమోహన్, రాములు, రాయల వీరస్వామి, ఎర్ర శ్రీకాంత్, ఎం.సుబ్బారావు, అలవాల నాగేశ్వరరావు, మల్లెంపాటి వీరభద్రరావు, కె.రమేష్, పారుపల్లి ఝాన్సీకుమారి, బి.రాజు, బి.వెంకన్న, షేక్ షమీ, వల్లంకొండ రాంబాబు, ఏ.సుధాకర్, పి.సురేష్, గీత, కె.నిర్మల కుమారి, మండవ నర్సయ్య రాందాస్, డి.నాగేశ్వర రావు, షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సై డ్రైవర్ అనుచితంగా ప్రవర్తించాడు..

సీఐ కార్యాలయం ఎదుట భైఠాయించిన మహిళ

కారేపల్లి: కారేపల్లి ఎస్సై ఎస్.రాజారాం డ్రైవర్‌గా పనిచేస్తున్న హోంగార్డు మల్లేశం తనతో అనుచితంగా ప్రవర్తించాడని ఆరోపిస్తూ ఓ మహిళ తన భర్త, పిల్లలతో కారేపల్లి సీఐ కార్యాలయం ముందు శనివారం భైఠాయించి నిరసన తెలిపింది. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని మేకలతండా గ్రామానికి చెందిన బానోతు రాజేష్, బానోతు రవి మధ్య బంగారం రుణం, ట్రాక్టర్‌తో దుక్కిదున్నిన పైకానికి సంబంధించిన లావాదేవీల వివాదం నడుస్తోంది. ఈ అంశంపై మూడు నెలల క్రితం పోలీసులకు ఫిర్యాదు చేయగా పెద్దల సమక్షాన ఒప్పందం కుదుర్చుకున్నారు. అయినా వివాదం సద్దుమణగకపోవటంతో కారేపల్లి ఎస్‌ఐ రాజారాం, డ్రైవర్ మల్లేశం శుక్రవారం రాత్రి 7గంటల సమయంలో మేకలతండా గ్రామానికి వెళ్లారు. అక్కడ ఎస్‌ఐ వాహనంలోనే ఉండగా, డ్రైవర్ మల్లేశం వెళ్లి రాజేష్ ఉన్నాడా అని ఆరా తీయగా లేడని ఆయన భార్య వాణీశ్వరి చెబుతుండగానే డ్రైవర్ ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఎన్నిసార్లు పిలిచినా రావడం లేదంటూ తన చెయ్యి పట్టుకొని చేతులో ఉన్న సెల్‌ఫోన్ లాక్కుని అసభ్యంగా మాట్లాడుతుండగా గట్టిగా అరవడంతో వెళ్లిపోయాడని వాణీశ్వరి వాపోయింది. ఈ అంశంపై శుక్రవారం రాత్రే ఆమె కారేపల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది.

ఎస్‌ఐ విచారణ

వాణీశ్వరి ఫిర్యాదుతో ఎస్‌ఐ రాజారాం, ఏఎస్‌ఐ నాగరాజకుమారి శనివారం మేకలతండాకు వెళ్లి విచారణ చేపట్టారు. ఈక్రమంలో డ్రైవర్ మల్లేశంపై చర్యలు తీసుకోవాలని, రాత్రి సమయాన ఇంటికి వచ్చి మహిళతో వ్యవహరించడం తీరు సరిగ్గా లేదని ఫిర్యాదు చేశారు. అనంతరం తమకు న్యాయం జరగదని చెబుతూ వాణీశ్వరి తన భర్త, పిల్లలతో కలిసి కారేపల్లి సీఐ ఆఫీసు ముందు భైఠాయించింది. వీరికి బంధువులు తోడు రావడంతో సీఐ తిరుపతిరెడ్డి నచ్చచెప్పినా ససేమిరా అనడంతో సీపీ, ఏసీపీ దృష్టికి తీసుకెళ్లారు. పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి డ్రైవర్‌పై చర్యలు తీసుకుంటామని సీఐ హామీ ఇవ్వగా వారు ఆందోళన విరమించారు.

చనిపోయిన వ్యక్తికి వాహన రుణం

కిస్తీ కోసం వెళ్లడంతో బయటపడిన వైనం

నల్లబెల్లి: బ్యాంక్ రుణం కావాలంటే అనేక షరతులు విధించే అధికారులు అందుకు విరుద్ధంగా మృతి చెందిన వ్యక్తికి వాహనం కొనుగోలుకు రుణం మంజూరు చేశారు. ఖమ్మంలోని ఓ ప్రైవేట్ బ్యాంక్ నుంచి రుణం మంజూరు కాగా.. కిస్తీ వసూళ్ల కోసం ఉద్యోగులు సదరు వ్యక్తి ఇంటికి వెళ్లగా విషయం బయటపడింది. శనివారం వెలుగు చూసిన ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలం నందిగామకు చెందిన భూక్యా రాకేష్ 2022 జనవరి 23న ఆత్మహత్య చేసుకున్నాడు. ఆయన పేరిట ఓ ప్రైవేట్ బ్యాంకు ఖమ్మం బ్రాంచ్ నుంచి 2023 అక్టోబర్ 18న రాయల్ ఎన్‌ఫీల్డ్ కొనుగోలుకు సుమారు రూ.3లక్షల రుణం మంజూరైంది. ఆతర్వాత మూడు వాయిదాలు కూడా జమ కాగా.. అనంతరం వాయిదాలు చెల్లించకపోవడంతో కలెక్షన్ మేనేజర్ శ్రీనివాస్, వెరిఫికేషన్ ఏజెంట్ అరవింద్ ఇటీవల నందిగామ వెళ్లారు. రుణం విషయాన్ని చెప్పడంతో రాకేష్ తల్లిదండ్రులు వారిని నిలదీసి చనిపోయిన వ్యక్తికి రుణం ఎలా ఇచ్చారు, దీని వెనుక ఎవరున్నారో తెలిసే వరకు వదిలేది లేదని చుట్టుముట్టారు. ఆపై పోలీసులకు సమాచారం అందించి ఉద్యోగులను అప్పగించారు. కాగా, ఆత్మహత్య చేసుకున్న రాకేష్ పేరిట నర్సంపేటకు చెందిన ఓ వ్యక్తి రుణం తీసుకున్నట్లు తెలుస్తుండగా, ఇందులో బ్యాంక్ ఉద్యోగులు, దళారుల పాత్ర ఉన్నట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

పలు మండలాలకు నిలిచిన తాగునీటి సరఫరా



పైప్‌లైన్ మరమ్మతులు చేస్తున్న భగీరథ సిబ్బంది

కొణిజర్ల: మిషన్ భగీరథ పైప్‌లైన్ల లీకేజీ మరమ్మతుల కారణంగా పలు మండలాలకు తాగునీటి సరఫరా నిలిచిపోయింది. కొణిజర్ల మండలం తనికెళ్ల ముక్రి హిల్స్ వద్ద ఏర్పాటు చేసిన భగీరథ వాటర్ ప్యూరిఫికేషన్ సెంటర్ నుంచి కొణిజర్ల, వైరా, బోనకల్, చింతకాని, మధిర, ఎర్రుపాలెం మండలాలకు తాగునీరు సరఫరా చేస్తున్నారు. అయితే, తనికెళ్ల వద్ద 900 పీసీసీపీ పైప్‌లైన్ లీకేజీ అవుతుండగా.. బోనకల్ సమీపాన 700 పీసీసీపీ, మధిర మండలంలో 500 పీసీసీపీ పైప్‌లైన్లకు కూడా లీకేజీ ఏర్పడింది. ఈనేపథ్యాన శుక్రవారం సాయంత్రం నుంచి మరమ్మతులు నిర్వహిస్తుండడంతో కొణిజర్ల మండలంలో 22 గ్రామాలు, బోనకల్ మండలంలో 22, మధిర మండలంలో 28, ఎర్రుపాలెంలో 37, చింతకాని మండలంలో 26 గ్రామాలకే కాక మధిర మున్సిపాలిటీ పరిధిలో తాగునీటి సరఫరా నిలిచిపోయింది. ఈ సందర్భంగా గ్రిడ్ ఏఈ చైతన్య మాట్లాడుతూ ఆదివారం సాయంత్రం వరకు మరమ్మతులు పూర్తిచేసి నీటి సరఫరా పునరుద్ధరిస్తామని వెల్లడించారు.

ఖమ్మం స్టేషన్‌లో 28 కేజీల గంజాయి స్వాధీనం

ఖమ్మంక్రైం: ఖమ్మం రైల్వేస్టేషన్‌లోని ప్లాట్‌ఫామ్‌- 2పై శనివారం చేపట్టిన తనిఖీల్లో రైల్వే పోలీసులు రూ.7లక్షల విలువైన 28 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ప్లాట్‌ఫామ్‌పై జీఆర్పీ ఎస్సై పి.భాస్కర్‌రావు, సిబ్బంది ఎం.శ్రీనివాసరావు, ఎస్.కే.అజీజ్ ఆధ్వర్యాన తనిఖీలు చేపట్టారు. మొదటి ఫుట్ ఓవర్ బ్రిడ్జి వద్ద నాలుగు బ్యాగులు కనిపించగా సమీపాన ఎవరూ లేకపోవడంతో తెరిచి పరిశీలించారు. దీంతో 28కేజీల గంజాయి లభించింది. ఉన్నతాధికారుల పర్యవేక్షణలో గంజాయిని సీజ్ చేసినట్లు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై భాస్కర్‌రావు తెలిపారు.

వివాహిత ఆత్మహత్యాయత్నం

నేలకొండపల్లి: మండలంలోని భైరవునిపల్లికి చెందిన ఓ వివాహిత ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. గ్రామానికి చెందిన సంధ్య శనివారం కుటుంబ తగాదాలతో ఎలుకల మందు తాగింది. కాసేపటికే గమనించిన కుటుంబీకులు ఆమెకు నేలకొండపల్లిలో చికిత్స అనంతరం మెరుగైన వైద్యం నిమిత్తం ఖమ్మం తరలించారు.

రైలుకింద తలపెట్టి ఆత్మహత్య

ఖమ్మంక్రైం: రైలు కింద పడి ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఖమ్మం జీఆర్పీ ఎస్సై భాస్కర్‌రావు కథనం ప్రకారం.. ఖమ్మం బల్లేపల్లి జయనగర్ కాలనీకి చెందిన గుడిమళ్ల కృష్ణ(44) కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. కుటుంబీకులు మందలించినా తీరు మార్చుకోని ఆయన జీవితంపై విరక్తితో ఖమ్మం రైల్వే స్టేషన్ ఒకటో నెంబర్ ప్లాట్‌ఫామ్ మీదుగా విజయవాడ వెళ్తున్న గూడ్స్ రైలుకింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. ప్లాట్‌ఫాంపై ప్రయాణికులు కిక్కిరిసి ఉన్న సమయాన కృష్ణ ఒక్కసారిగా రైలుకింద తలకాయ పెట్టగా మొండెం నుంచి తల వేరు కావడంతో ప్రయాణికులు హాహాకారాలు చేశారు. అన్నం ట్రస్ట్ చైర్మన్ అన్నం శ్రీనివాసరావు సహకారంతో ఆయన మృతదేహాన్ని మార్చురీకి తరలించిన పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

క్లుప్తంగా

నేడు సీనియర్ నెట్‌బాల్ జట్టు ఎంపిక పోటీలు

ఖమ్మం స్పోర్ట్స్: ఉమ్మడి జిల్లాస్థాయి సీనియర్ పురుషులు, మహిళల నెట్‌బాల్ జట్ల ఎంపికకు ఆదివారం ఖమ్మంలోని సెయింట్ జోసెఫ్ హైస్కూల్‌లో పోటీలు నిర్వహిస్తున్నట్లు నెట్‌బాల్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి ఎస్.ఫణికుమార్ తెలిపారు. హాజరయ్యే క్రీడాకారులు వయసు ధృవీకరణ పత్రాలతో ఉదయం 8గంటలకు రిపోర్టు చేయాలని కోరారు. ఇక్కడ ఎంపిక చేసే జట్లు ఈనెల 30నుంచి హైదరాబాద్‌లోని దోమలగూడ ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాలలో రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటాయని తెలిపారు.

కారుణ్య కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ

కొణిజర్ల: భద్రాచలంలో నర్సింగ్ చదువుతూ అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన పి.కారుణ్య మృతదేహం వద్ద వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ శనివారం నివాళులర్పించారు. ఆమె స్వగ్రామమైన కొణిజర్ల మండలం సిద్ధిక్‌నగర్‌లో శనివారం అంత్యక్రియలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విద్యార్థిని కుటుంబీకులను పరామర్శించి అండగా ఉంటానని హామీ ఇచ్చారు. మార్క్‌ఫెడ్ రాష్ట్ర మాజీ వైస్ చైర్మన్ బొర్రా రాజశేఖర్, నాయకులు కోసూరి శ్రీను, రాయల పుల్లయ్య, శేషగిరిరావు, నారాయణరావు, హరినాద్, మోష, కృష్ణారావు, నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

రెండో రోజుకు చేరిన ఇంటర్ పరీక్షలు

ఖమ్మం సహకారనగర్: ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు శనివారం రెండో రోజుకు చేరాయి. జిల్లాలోని 42కేంద్రాల్లో పరీక్షలు నిర్వహిస్తుండగా ప్రథమ సంవత్సరం పరీక్షకు 2,637 మందిలో 2,437మంది హాజరయ్యారు. ద్వితీయ సంవత్సరం పరీక్షకు 508 మంది విద్యార్థులకు గాను 471మంది హాజరయ్యారని డీఐఈఓ రవిబాబు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

నేలకొండపల్లి: మండలంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు గాయపడ్డారు. మండలంలోని మంగాపురంతండాకు చెందిన రామారావు నాచేపల్లి నుంచి నేలకొండపల్లికి బైక్‌పై వస్తున్నారు. ఇదే సమయాన ముదిగొండ మండలం బాణాపురానికి చెందిన సతీష్, రాము బైక్‌పై నేలకొండపల్లి నుంచి ఇంటికి వెళ్తున్నారు. గ్రామ శివారులో ఉన్న దేవాలయం వద్ద వీరి వాహనాలు ఢీకొనగా, ముగ్గురికి గాయాలు కావడంతో నేలకొండపల్లిలో ప్రథమ చికిత్స అనంతరం ఖమ్మం తరలించారు.